ఆకట్టుకుంటున్న బీఆర్ఎస్ ప్రచార రథం

కొండమల్లేపల్లి, అక్టోబర్ 22 : దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన రథం ఆకట్టుకుంటున్నది. ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రచార రథంపై సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్, కారు గుర్తు ఫొటోలను ప్రచురించారు.

దేవరకొండ ఎమ్మెల్యే ప్రచార రథం

ప్రచార రథంపై ఏర్పాటు చేసిన వేదిక

దాంతో పాటు ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు తెలిపేలా, ఆకర్షణీయంగా గులాబీ రంగులో తయారు చేసిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దాంతో పాటు వాహనానికి ఎల్ఈడీ లైట్లు, మైకులు, జనరేటర్, ప్రత్యేక మైన వేదిక ఏర్పాటు చేశారు. ఆదివారం వాహనం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంది.

మార్కెట్‌లో దసరా సందడి

- కిక్కిరిసిన వ్యాపార కూడళ్లు
- దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్, గృహోపకరణాల కొనుగోళ్లు

రామగిరి, అక్టోబర్ 22: జిల్లా కేంద్రంలో ఆదివారం పండుగ కోలాహలం నెలకొంది. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో మార్కెట్‌లో సందడి కనిపించింది. ఎటు చూసినా ప్రజలు వివిధ వస్తువులు కొనుగోలు చేస్తూ కనిపిస్తున్నారు. అన్ని దుకాణాలు జనంతో కిక్కిరిశాయి.

పోటీపడి మరీ ఆఫర్లు

దసరా పండుగ కోసం ప్రజలు దుస్తులు, చెప్పులు, గృహోపకరణాలు కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌లో రద్దీ నెలకొంది. దీంతో పాటు మార్కెట్‌లో వ్యాపారులు పోటీ పడి వివిధ వస్తువులపై ఆఫర్లను ప్రకటించారు. మరో వైపు సెల్‌ఫోన్ దుకాణాలు కూడా దసరా ఆఫర్లను ఇవ్వడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చారు. గ్రామాల నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వివిధ వస్తువులు కొనుగోలు చేయడంతో జిల్లా కేంద్రంలోని వ్యాపార కూడళ్లన్నీ జనంతో నిండిపోయాయి.

నల్లగొండలోని షాపింగ్ మాల్‌లో దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నల్లగొండ ఎస్‌పీటీ మార్కెట్‌లో రద్దీ

రెడీమేడ్ దుకాణంలో దుస్తులు కొనుగోలు చేస్తున్న యువత

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

దేవరకొండ, అక్టోబర్ 22 : మండలంలోని మైనంపల్లి పరిధిలో గల మాల్‌గడ్డ ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి వడ్డ్య వెంకటేశ్ రూ.25 లక్షలు విరాళంగా అందిస్తానని ప్రకటించారు. అందులో భాగంగా ఆదివారం లక్ష రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన వెంకటేశ్‌ను కమిటీ సభ్యులు అభినందించారు. శాలువాతో ఘనంగా సన్మానించారు.

29 నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 22 : ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర రెండో మహా సభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ధర్మభిక్షం భవన్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సభ్యులు రూపాని వివేకానంద, తాళ్ల సైదులు, పల్స రాజు, లింగయ్య, వెంకట్‌రెడ్డి, వెంకన్న, కప్పల రాము పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం కేసీఆర్ సభకు ఉప్పెనలా తరలిరావాలి

- ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురవేద్దాం
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- 29న ఆలేరులో జరిగే సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

ఆలేరు, అక్టోబర్ 22 : ఈనెల 29న ఆలేరులో జరిగే సీఎం ఆశీర్వాద సభకు ప్రజలు ఉప్పెనలా తరలిరావాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం సభ స్థలం వద్ద ఏర్పాట్లను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించిన దమ్మున్న నాయకుడు సీఎం నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆలేరులో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దామన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గ్రూపుతగాదాలతో సిగపట్లు పడుతుంటే క్యాడర్లో తీవ్ర నైరాశ్యం నెలకొందని చెప్పారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారాన్ని రెండు విడతలుగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలేరులో ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించేందుకు సీఎం కేసీఆర్ 29న ఆలేరుకు వస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగిందన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ వస్పర్ శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, కౌన్సిలర్ రాయపురం నరసింహులు, బేతి రాములు, కందుల శ్రీకాంత్, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి, పోరెడ్డి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పత్తి వెంకటేశ్, సంపత్, ఆడెపు బాలస్వామి పాల్గొన్నారు.

ఆలేరులో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

మోత్కూరు, అక్టోబర్ 22 : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియా సెల్ అధ్యక్షుడిగా మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న ఆదివారం వెంకటేశ్వర్లుకు నియామకపత్రం అందజేశారు.

వెంకటేశ్వర్లు

టీకా వికటించి బాలుడు మృతి

మద్దిరాల, అక్టోబర్ 22 : టీకా వికటించి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. బాలుడు తల్లి స్వప్న తెలిపిన వివరాల ప్రకారం.. బాబుకు రెండు నెలల పది రోజులు పూర్తి కావడంతో రెండో టీకా వేయాలని ఏఎన్ఎం ఫోన్ చేయగా బాలుడిని తీసుకెళ్లాం. వారు టీకా వేసి పంపించారు. జ్వరం వస్తే పారాసిటమాల్ తాపించాల్సిందిగా సిరప్ ఇచ్చారు. సాయంత్రం తీవ్ర జ్వరం రావడంతో బాబుకు సిరప్ పోశాం. అయినా తగ్గలేదు. తిరిగి వారికే ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేదు. దాంతో స్థానికంగా ఉండే ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించాడు. ఈ విషయమై నూతనకల్ ప్రభుత్వ వైద్యురాలు అశితరెడ్డిని వివరణ కోరగా.. శనివారం నలుగురు పిల్లలకు టీకాలు వేశాం. ఎవరికి ఎలాంటి సమస్య రాలేదు. ఈ బాలుడికే ఇలా జరుగడం దురదృష్టకరం. ఇంతకు ముందు ఏమైనా అనారోగ్య సమస్యలు ఉండవచ్చని తెలిపారు.

దుర్గమ్మకు పూజలు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 22 : జిల్లా కేంద్రంలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన దుర్గామాతా మండపాల వద్ద ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. 9వ వార్డులోని ఎన్టీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ పూజలు చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు దుర్గయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు అమరులకు నివాళి

దేవరకొండ, అక్టోబర్ 22 : పోలీసు అమరులకు ఆదివారం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణ కిశోర్, రాపోలు నిరంజన్, బత్తుల అమర్, షామ్‌సన్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

పూజలు చేస్తున్న రమణానంద మహర్షి

గౌరీదేవిగా అమ్మవారు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 22 : మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని రమణేశ్వరంలో ఆదివారం అమ్మవారు గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రమణానంద మహర్షి అమ్మవారికి ప్రతేక పూజలు నిర్వహించారు.